


## హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్ట్ 2

ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
శనివారం 29 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:08



# సీఎంఆర్ బియ్యం బకాయిలపై కఠిన చర్యలు



- ఖరీఫ్, రబీ 2021-22లో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి
- పవన సుత రైస్ మిల్ రూ.12.28 కోట్ల డిఫాల్ట్
- డిఫాల్ట్ మిల్లర్ పవన్ కుమార్ తో పాటు ట్రక్ చిట్టీల్లో సంతకాలు చేసిన వొల్లాల నవీన్ కుమార్ కేసు నమోదు - పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి):**

మంథని పవనసుత రైస్ మిల్ సీఎంఆర్ బియ్యం డిఫాల్ట్‌కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథనిలోని రావికంటి పవన్ కుమార్ యాజమాన్యంలోని పవన సుత రైస్ మిల్‌కు ఖరీఫ్, రబీ 2021-22 సీజన్లలో మొత్తం 5,798.080 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, దానికి సమానంగా 3,891.295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉందని తెలిపారు.అయితే మిల్లర్ ఇప్పటివరకు 1,069.380 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఎఫ్‌సీఐ/ టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించారని పేర్కొన్నారు. మిగతా 2 లో





# గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్‌కుమార్.

- గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు, మద్దుల గోపాల్‌రెడ్డి

**వెల్గటూర్, ఆగస్టు 28,ప్రజా జ్యోతి**

మండలంలోని సంకనపల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో 20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని శుక్రవారం సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్ నాయకత్వంలో ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. నూతన పంచాయతీ భవనంతో గ్రామ పాలన మరింత సమర్థంగా సాగుతుందని తెలిపారు. పంచాయతీ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మిగతా 2 లో

# హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

## - బార్‌లో క్యాషియర్‌పై స్టీల్ కడియంతో దాడి.. బీర్ బాటిల్‌తో కొట్టేందుకు యత్నం

## - గంటల్లోనే నిందితుడి అరెస్ట్




**కోరుట్ల, ఆగస్టు 28 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా కోరుట్ల ఎస్సై శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి హత్యాయత్నం కేసులో రౌడీషీటర్‌ను అరెస్ట్ చేశారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మనీబార్ అండ్ రెస్టారెంట్‌లో ఆగస్టు 27న రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో క్యాషియర్‌పై బింగి అలియాస్ బంగి నగేష్ (24) దాడికి పాల్పడ్డాడు. బీర్ ఇవ్వాలని క్యాషియర్‌ను దుర్భాషలాడిన నిందితుడు, తనను ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురై చేతికి ఉన్న స్టీల్ కడియంతో ముఖంపై దాడి చేశాడు.అనంతరం బీర్ బాటిల్‌తో క్యాషియర్ తలపై కొట్టేందుకు ప్రయత్నించగా బాధితుడు తప్పించుకున్నాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఎస్సై శ్యామ్‌రాజ్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడిని ఆగస్టు 28న కోరుట్లలో అరెస్ట్ చేశారు. దాడికి ఉపయోగించిన స్టీల్ కడియాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు.

**- నేర చరిత్ర ఉన్న రౌడీషీటర్**

నిందితుడు నగేష్‌పై గతంలోనూ పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. దీంతో కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో అతనిపై రౌడీషీట్ కొనసాగుతోంది. రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని పేర్కొన్నారు.

**- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు తప్పవు**

రౌడీషీటర్లు, నేరస్తులు ప్రజలను బెదిరించడం, గొడవలకు పాల్పడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్యామ్‌రాజ్ హెచ్చరించారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే వెంటనే కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఎస్సై శ్యామ్ రాజ్ స్పష్టం చేశారు.

# సీఎంఆర్ బియ్యం బకాయిలపై కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి



దీంతో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి ఉన్నట్లు తెలిపారు. ఇది 4,211.813 మెట్రిక్ టన్నుల సమాన ధాన్యానికి సమానమని, దీని విలువ రూ.9,82,51,492గా ఉందని పేర్కొన్నారు. 25 శాతం పెనాల్టీ రూ.2,45,62,873 కలిపి మొత్తం డిఫాల్ట్ మొత్తం రూ.12,28,14,365గా నిర్ధారించినట్లు తెలిపారు. రబీ 2021-22కు సంబంధించి పవనసుత రైస్ మిల్లుకు అప్పగించిన ధాన్యాన్ని మంథనిలోని శ్రీలక్ష్మి ఎంఆర్ఎం సూరయ్య పల్లి మిల్లుకు తరలించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పీపీసీల ద్వారా సమర్పించిన ట్రక్ చిట్టీలు, జాయింట్ సంతకాలను అధికారులు పరిశీలించగా, శ్రీలక్ష్మి ఎంఆర్ఎం, సూరయ్యపల్లికి చెందిన భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్ సంతకాలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన ధాన్యం స్వీకరణ, అంగీకారానికి సంబంధించిన ట్రక్ చిట్టీల్లో నవీన్ కుమార్ సంతకాలు ఉన్న నేపథ్యంలో ఆయన పాత్రపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పవన సుత రైస్ మిల్ యాజమాని రావికంటి పవన్ కుమార్, శ్రీలక్ష్మి ఎంఆర్ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం విషయంలో డిఫాల్ట్‌కు పాల్పడిన మిల్లర్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు, రికవరీ తదితర చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.



# గ్రామ పంచాయతీ భవనం ప్రారంభించిన మంత్రి లక్ష్మణ్‌కుమార్,

మొదటిపేజీ తరువాయి



ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్ల తిరుపతి, పాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, ఎండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ పుదరి రమేష్, సర్పంచుల ఫోరం నాయకులు కుశ లక్ష్మణ్, సంగ రమేష్, ఎండపల్లి మండల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎంజీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన సోదరి

**వేములవాడ,ఆగస్ట్,28:ప్రజాజ్యోతి.**

రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆయన సోదరి లీల స్వగృహంలో రాఖీ కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదర సోదరీమణుల ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని ఆది శ్రీనివాస్ పేర్కొంటూ, ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు...



# వైభవంగా రాఖీ వేడుకలు

**మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి):**

అన్నచెల్లెళ్ల అనురాగానికి, అక్క తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న అక్క చెల్లెలు తమ గ్రామాలకు, పట్టణాలకు వచ్చి అన్న తమ్ములకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. మన సంస్కృతీ సాంప్రదాయాలకు అద్దం పడుతూ, తోబుట్టువుల మధ్య ఉండే పవిత్రమైన బంధాన్ని చాటిచెబుతూ వేడుకలు నిర్వహించుకున్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినం వేల రక్షాబంధన్ పురస్కరించుకొని పవిత్రమైన రోజున అక్కాచెల్లెళ్ల ఆశీస్సులు, అన్నదమ్ముల రక్షణ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలను నింపింది. మంథని పట్టణంలో రక్షాబంధన్ వేల సోదరీ సోదరీమణుల సందడితో కిక్కిరిసిపోయింది.





# ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు రాఖీ కట్టిన రాజన్న - ఆలయ ఈవో రమాదేవి



**వేములవాడ,ఆగస్ట్,28:ప్రజాజ్యోతి.**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్య నిర్వాహణాధికారి ఎల్. రమాదేవి రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పండుగ శుభాకాంక్షలు తెలిపి, స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దేవస్థానం ఈవోకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాజన్న ఆలయ అభివృద్ధికి మరియు భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాలను ఆలయ పబ్లిక్ రిలేషన్స్ అధికారి పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.

# కొలనూర్ లో గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

## - ప్రభుత్వ విప్ కు వినతి పత్రం సమర్పించిన కాంగ్రెస్ నేతలు

**కొనరావుపేట, ఆగస్టు.28(ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం కొలనూరు గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు ఈరోజు గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల్లో భాగంగా జమ్మి చెట్టు వద్ద కల్వర్టు నిర్మించాలని వర్షాకాలంలో అటు వైపు వెళ్లే రైతులకు చాలా ఇబ్బందిగా ఉందని మరియు బోనాల రోడ్డు తారు రోడ్డు సిసి రోడ్లు మరియు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.దీనికి సానుకూలంగా స్పందించి త్వరలోనే మంజూరు చేపిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మెరుగు చందు, సీనియర్ నాయకులు వీరబోయిన తిరుపతి యాదవ్, తుమ్మల స్వామి, బోల్గం కమలాకర్, మెరుగు దేవయ్య, మెరుగు రాజయ్య, మెరుగు వెంకటేశం ,పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్

**వేములవాడ,ఆగస్ట్,28:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ పథకం ద్వారా అనేక మంది నిరాశ్రయులకు సొంత ఇల్లు నిర్మాణం చేసుకోవడం ఆనందకరమని ఆయన అన్నారు..



# ఘనంగా మార్కండేయ స్వామి శోభాయాత్ర

**కోనరావుపేట,ఆగస్టు.28(ప్రజాజ్యోతి)**



కొనరావుపేట మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూలు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో జరిగాయి. ఈ పవిత్ర పర్వదినం సందర్భంగా, ప్రధాన వీధుల గుండా శ్రీ మార్కండేయ స్వామి వారి భారీ శోభాయాత్ర ఘనంగా జరిగింది. ఉదయాన్నే పద్మశాలి సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ మార్కండేయ స్వామి వారి విగ్రహాన్ని ప్రత్యేక పూజలతో అలంకరించి, పల్లకిపై ఉంచి శోభాయాత్రను ప్రారంభించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాల నడుమ, మహిళల మంగళహారతులతో వీధులు పులకించిపోయాయి. యువకులు, పెద్దలు భక్తి పారవశ్యంతో నృత్యాలు చేశారు. 'ఓం నమో మార్కండేయాయ' అనే నామస్మరణతో కోనరావుపేట మార్మోగింది. నూలు పౌర్ణమి పద్మశాలి సమాజానికి అత్యంత విశిష్టమైనది. ఈ రోజున తాము తయారుచేసే పవిత్రమైన నూలు పోగులను స్వామి వారికి సమర్పించి, ఆశీస్సులు తీసుకోవడం, జంజాలు ధరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాత్రలో పద్మశాలి సంఘం నాయకులు, పెద్దలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. యాత్ర అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# ప్రయాణికుల కష్టాలు తీర్చేలా ఆర్ఓబీ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- గౌరెడ్డిపేట, కన్నాల, కుందన్‌పల్లి లెవల్ క్రాసింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి



**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 28 ప్రజా జ్యోతి;**

ప్రయాణికుల కష్టాలను తీర్చే విధంగా జిల్లాలో చేపడుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీలో కన్నాల ఆర్ఓబీ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ లెవల్ క్రాసింగ్‌ల వద్ద చేపడుతున్న పనుల పురోగతిని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు తో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గౌరెడ్డి పేట, కన్నాల, కుందన్‌పల్లి ప్రాంతాల్లో చేపడుతున్న లెవల్ క్రాసింగ్ సంబంధిత రహదారి, ఆర్ఓబీ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా పరిష్కారమవుతాయని తెలిపారు. పనుల పురోగతిలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని, ఎలాంటి జాప్యానికి అవకాశం ఇవ్వకుండా పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఏడి సర్వేయర్ సోమేశ్వర్, ఆర్డీఓ గంగయ్య, ఆర్అండ్‌బీ ఈఈ భా వ్‌సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంథని మదర్ థెరిస్సా పొదుపు సమితి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలి

**మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి):**

మంథని మదర్ థెరిస్సా మహిళ పొదుపు సమితి ఆర్థిక అవకతవకలు, పారదర్శకత లోపం పై చట్ట పరమైన విచారణ జరపాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ను ఆర్టిఐ ద్వారా కోరినట్లు నామని హరీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొదుపు సంఘంలో జరుగుతున్న పలు అంశాలపై విచారణ జరపాలని ఆర్టిఐ దరఖాస్తులో కోరారు. మదర్ థెరిస్సా సంస్థకు సంబంధించిన అనుమతులు, పరిమితులు, పొదుపు సంస్థ ప్రారంభ తేది నుండి ఇప్పటి వరకు ఉన్నటువంటి సభ్యుల సంఖ్య తెలుపాలన్నారు. పొదుపు సమితి లావాదేవీలు, రుణాలు ఇవ్వడం, వడ్డీ వసూళ్లపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. క్రిస్టియన్ మిషనరీ కి సంబంధించిన లోడి సంస్థతో ఎలాంటి సంబంధం లేని మదర్ థెరిస్సా పొదుపు సమితి లావాదేవీలు ఆడిట్ జరుగుతున్నాయా? లేదా? అంశాలపై సమగ్ర విచారణ జరిపి బహిరంగపరచాలన్నారు. సొసైటీ నిబంధనలకు లోబడి లావాదేవీలు నిర్వహిస్తున్నాం తమది రిజిస్టర్డ్ సొసైటీ అని సొసైటీ నిబంధనలకు లోబడి లావాదేవీలు నిర్వహిస్తున్నామని మదర్ థెరిస్సా పొదుపు సమితి మేనేజర్ మేకల మల్లేశం తెలిపారు. తమ పొదుపు సంస్థ పై ఎవరికైనా, ఏమైనా అభ్యంతరాలు ఉంటే అన్ని వివరాలు వెల్లడిస్తామన్నారు.



# చూపు కోసం పోరాడుతున్న బాలికకు 'నయీం' చేయూత

- ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి రూ.5 వేల సాయం

**వేములవాడ,ఆగస్ట్,28:ప్రజాజ్యోతి.**

కంటి చూపు సమస్యతో దీర్ఘకాలంగా బాధపడుతున్న బాలికకు ఆపన్నహస్తం అందింది. వేములవాడ పట్టణంలోని సాయినగర్‌కు చెందిన జూబియా తబస్సుం చాలాకాలంగా కంటి చూపు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు పలు ఆసుపత్రులను ఆశ్రయించినప్పటికీ.. ఆర్థిక స్థోమత లేక చికిత్స కొనసాగించేందుకు సతమతమవుతున్నారు. బాలిక పరిస్థితి గురించి తెలుసుకున్న సామాజిక సేవకుడు మహమ్మద్ నఈమోద్దీన్ (నయీం) మానవత్వంతో స్పందించారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 వేల నగదును అందజేశారు. బాలిక చికిత్సకు అవసరమైన సహాయాన్ని రాబోయే రోజుల్లోనూ అందిస్తానని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన నయీం సేవలను కుటుంబ సభ్యులు కృతజ్ఞతతో గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ మాజీ నాయకులు, మత పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- ఏఎంసి చైర్మన్ ఎల్లయ్యకు రాఖీ కట్టిన సోదరి గీత

**కొనరావుపేట,ఆగస్టు.28(ప్రజాజ్యోతి)**

అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటి చెప్పే రక్షాబంధన్ వేడుకలు కోనరావుపేట మండలంలో ఘనంగా జరుపుకున్నారు. సుద్దాల గ్రామం లో కోనరావుపేట ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య కు ఆయన సోదరి ఉడుతల గీత, తన స్వగృహంలో రాఖీ కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించారు. అక్క చెల్లెల అన్న తమ్ముళ్లకు రాఖీ కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదర సోదరీమణుల ప్రేమకు ప్రత్యేకగా నిలుస్తుందని ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య పేర్కొంటూ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



# మొక్కలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి

- వన రక్షణ ప్రేమికుడు రమేష్ కు సన్మానం....
- ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి.....

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 28 ప్రజా జ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మొక్కలను పెంచడం, నాటడమే కాకుండా వాటిని రక్షించాలని ప్రచారం చేస్తున్న మొక్కల, పర్యావరణం ప్రేమికుడు దుంపెన రమేష్ ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ పద్మావతి శాలువాతో సన్మానం చేశారు. ఆగష్టు 28న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ప్రకృతి పర్యావరణంను కాపాడుకోవాలనీ పర్యావరణం కాపాడే వారిని సన్మానించుకోవాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు జ్యాతోతు శ్రీనివాస్, గజ్జెల గంగాధర్, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, షాహినా సుల్తానా , నిఖిల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

## - కేంద్ర మంత్రి బండిసంజయ్, ఎమ్మెల్యే గంగుల ఇంట్లో రాఖీ పండుగ సందడి

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి)**

అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల మధ్య ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని పట్టణాలు, పల్లెల్లో సందడి నెలకొంది. ఉదయం నుంచే మహిళలు, బాలికలు తమ సోదరుల ఇళ్లకు చేరుకుని రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరులకు హారతులు ఇచ్చి, నుదుట తిలకం దిద్ది రాఖీ కట్టి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు. సోదరులు సైతం తమ సోదరీమణులకు కానుకలు అందించి, జీవితాంతం అండగా ఉంటామని భరోసా కల్పించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని ప్రధాన మార్కెట్లు, షాపింగ్ ప్రాంతాలు సందడిగా మారాయి. వివిధ రకాల రంగురంగుల రాఖీలు, స్వీట్లు, పండ్లు, పండుగ సామగ్రి కొనుగోళ్లతో వ్యాపార కేంద్రాల్లో రద్దీ కనిపించింది. చిన్నారులు, యువతులు ప్రత్యేకంగా ఆకర్షణీయమైన రాఖీలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఉద్యోగ, విద్య, ఇతర కారణాలతో దూర ప్రాంతాల్లో ఉన్న సోదరులు సైతం తమ స్వస్థలాలకు చేరుకోవడంతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. పలువురు సోదర, సోదరీమణులు సామాజిక మాధ్యమాల ద్వారా రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన రాఖీ పౌర్ణమి.. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని పలువురు పేర్కొన్నారు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకం, రక్షణకు ప్రతీకగా రాఖీ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.







### నగరంలో రాఖీ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ వయోవృద్ధుల మరియు వికలాంగుల వసతి గృహం, శిశు గృహంలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి సరస్వతి గారు ముఖ్య అతిథిగా హాజరై, వసతి గృహంలోని వయోవృద్ధులు, వికలాంగులు మరియు శిశు గృహంలోని చిన్నారులతో కలిసి రాఖీ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

### సోదరి శైలజతో రాఖీ కట్టించుకున్నకేంద్ర మంత్రి బండి సంజయ్

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తన సోదరి శైలజతో రాఖీ కట్టించుకున్నారు. కరీంనగర్‌లో జరిగిన ఈ ఆత్మీయ కార్యక్రమంలో సోదరి శైలజ బండి సంజయ్ కుమార్‌కు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదర, సోదరీమణుల మధ్య అనుబంధం, ఆప్యాయతకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి కొనసాగుతున్న అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ రాఖీ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. రాఖీ కట్టిన అనంతరం సోదరి శైలజకు బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ బంధాలు, ఆత్మీయత, పరస్పర ప్రేమానురాగాలను చాటే రక్షాబంధన్ వేడుకలు ప్రతి ఇంట్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు.

### నగరపాలక సంస్థలో రక్షాబంధన్ వేడుకలు.

శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ లో రక్షాబంధన్ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణం లో వైభవంగా జరిగాయి. రాఖీ పండగ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ సోదరీలు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ కి పవిత్ర తిలకం పెట్టి.రాఖీ కట్టారు. అనంతరం స్వీట్లు తినిపించి ఆశీస్సులు అందజేశారు. అనంతరం కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ బ్రహ్మ కుమారీలకు రాఖీ శుభాకాంక్షలతో ధన్యవాదాలు తెలిపారు.

### కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల నివాసంలో రాఖీ పండుగ సందడి

కరీంనగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. అన్నాచెల్లెళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను గంగుల కుటుంబ సభ్యులు ప్రతి ఏటా మాదిరిగానే ఈసారికూడా ఎంతో ఉత్సాహంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా గంగుల కమలాకర్ సోదరీమణులు పుష్పలత, స్వర్ణలత, అరుణలత లు తమ సహోదరులైన గంగుల కమలాకర్ తో పాటు వెంకన్న, సుధాకర్‌లకు ఘనంగా రాఖీలు కట్టారు. తమ సోదరుల ఆయురారోగ్యాలు, క్షేమాన్ని కాంక్షిస్తూ మణికట్టుపై రక్షాసూత్రం కట్టి, ప్రేమతో మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు మాట్లాడుతూ, తాము ఎక్కడ ఉన్నప్పటికీ ప్రతి ఏటా ఈ పండుగ రోజున కచ్చితంగా కలుసుకొని రాఖీ కట్టడం తమ కుటుంబంలో ఆనవాయితీగా వస్తోందని, ఈ బంధం ఎప్పటికీ ఇలాగే నిలవాలని ఆకాంక్షించారు.



## బీజేపీ నాయకుడు మోతే మహేందర్‌ను పరామర్శించిన - డిప్యూటీ మేయర్

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 28(ప్రజాజ్యోతి)**

నిన్న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై నగరంలోని అపోలో ఆసుపత్రిలో శస్త్రచికిత్స (సర్జరీ) చేయించుకొని చికిత్స పొందుతున్న బిజెపి నాయకుడు, భగత్ నగర్ కు చెందిన మోతే మహేందర్‌ను.. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు శుక్రవారం పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేందర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహేందర్ కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. మహేందర్ త్వరగా కోలుకుని, మళ్లీ యథావిధిగా తన కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేలా ఆ భగవంతుడు ఆయనకు ఆరోగ్యాన్ని, ధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు.



## మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ (డబ్ల్యూజె) గౌరవ అధ్యక్షునిగా కొండేలా మారుతి

**మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి):**



మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ డబ్ల్యుజే గౌరవ అధ్యక్షునిగా కొండేలా మారుతి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోతుకూరి శ్రీనివాస్, గడిపల్లి అజయ్ శుక్రవారం ప్రకటించారు. పత్రిక రంగంలో అపార అనుభవం కలిగి, సామాజిక సేవా రంగంలో విశేష అనుభవం కలిగి సేవలు అందిస్తున్న కొండేల మారుతి నియామకం పట్ల మంథని డివిజన్ ప్రెస్ క్లబ్ (డబ్ల్యూజె) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కొండేల మారుతి అనుభవాలు ఆలోచనలు తమకు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు.

# రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో సత్తా చాటిన పారమిత విద్యార్థులు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 28( ప్రజాజ్యోతి )**

స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 2వ తరగతి 3 తరగతి చదువుతున్న విద్యార్థులు3వ తెలంగాణ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో బంగారు,కాంస్య పథకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఈ నెల 23 వ రోజున హైదరాబాద్ నగరంలోని అల్మాస్ గూడ లో తెలంగాణ రోప్ స్కిప్పింగ్ క్రీడా సమాఖ్య అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ తెలంగాణ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో భాగంగా అండర్ 10 విభాగంలో పారమిత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న సి.హెచ్. ఈశ్వర సాయి, అండర్ 8 విభాగంలో 2వ తరగతి చదువుతున్న డి. నిఖిల్ లు అద్భుత ప్రతిభ తో బంగారు పతకం సాధించారు. అలాగే 2వ తరగతి చదువుతున్న ఎమ్. శ్రేయాన్స్ అండర్ 8 విభాగంలో కాంస్య పతకం సాధించాడు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలో బంగారు, కాంస్య పథకాలు సాధించిన సి. హెచ్. ఈశ్వర్ సాయి, డి.నిఖిల్ ఎం. శ్రేయన్స్ లను పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. మరియు



పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద రావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత సమన్వయకర్త శ్రీనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు రామక్రిష్ణ, కళ్యాణ్, మహేష్ లు అభినంధించారు .

# రక్షాబంధన్ వేల చెట్లకు 100 రాఖీలు కట్టిన ఐ రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ , పద్మశ్రీ వనజీవి హరిత అవార్డు గ్రహీత సిరిసిల్ల జిల్లా చిన్నారి ప్రకృతి బ్లెస్సి,

## ఏడేళ్లుగా సోదరుని కంటే ముందే చెట్లకు రాఖీలు

**కోనారావుపేట,ఆగస్టు.28(ప్రజాజ్యోతి)**

ప్రకృతి ప్రేమను చాటుకుంటూ,ప్రాణవాయువును అందించే చెట్లకు రాఖీలు కట్టి పర్యావరణ సమతుల్యతపై సరికొత్త నిర్వచనం ఇచ్చింది చిన్నారి ప్రకృతి బ్లెస్సి (10).

రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం, సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి బ్లెస్సి, ,పర్యావరణ ప్రేమికుడు 'ప్రకృతి ప్రకాష్' కుమార్తె. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణలో తనదైన ముద్ర వేసుకుంది ఈ క్రమంలో "ఐ రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్" సాధించడంతో పాటు "పద్మశ్రీ వనజీవి హరిత అవార్డు" గ్రహీతగా గుర్తింపు పొందింది ప్రస్తుతం బద్దెనపల్లి గురుకులంలో ఏడవ తరగతి చదువుతుంది,



**ఏడేళ్లుగా స్వయంగా పేపర్ తో రాఖీల తయారీ**

గత ఏడేళ్లుగా సొంతంగా కాగితాలతో రాఖీలు తయారు చేస్తూ చెట్లకు కడుతున్న బ్లెస్సి, ఈసారి కూడా రెండు రోజుల పాటు శ్రమించి 100 కాగితపు రాఖీలను సిద్ధం చేసింది.చెట్లకు రక్షాబంధనం: రాఖీ పౌర్ణమి శుక్రవారం నాడు తన ఇంటి ఆవరణలో తాను నాటిన చెట్లతో పాటు, హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు ఈ రాఖీలను కట్టింది.విత్తన బంతుల విసిరే కార్యక్రమం: తన తండ్రితో కలిసి విత్తనాలను సేకరించి, విత్తన బంతులు (రావవన ధీశ్రీశ్రీం) తయారు చేసి అటవీ ప్రాంతాల్లో వెదజల్లుతూ పర్యావరణ సేవలో భాగస్వామి అవుతోంది.ఈ సందర్భంగా చిన్నారి ప్రకృతి బ్లెస్సి మాటల్లో:"రాఖీ పండుగ అనేది కేవలం సొంత సోదరులకే పరిమితం కాదు. మనం పుట్టినప్పటి నుంచి కన్నుమూసే వరకు ఉచితంగా ప్రాణవాయువును ఇస్తూ, కంటికి రెప్పలా కాపాడుతున్న చెట్లే మనకు నూరేళ్ల రక్ష అందుకే నా సొంత సోదరుడి కంటే ముందే చెట్లకే రాఖీలు కడుతున్నాను. రాఖీ పండుగ వేళ ప్రతి ఒక్కరూ చెట్లకు రాఖీలు కట్టి, వాటిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయాలని కోరింది.

# సత్యసాయి అనాథ ఆశ్రమంలో అన్నప్రసాదం



**జమ్మికుంట ఆగస్టు 27 (ప్రజాజ్యోతి):**



సల్ల రాజేష్ దశాదిన కర్మ 10వ రోజు సందర్భంగా ఆయన స్నేహితులు మానవత్వాన్ని చాటే సేవా కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి మానసిక వికలాంగుల అనాథ ఆశ్రమంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, ఆశ్రమంలోని వారికి భోజనం అందించారు.రాజేష్‌తో చిన్ననాటి నుంచి కలిసి ఉన్న స్నేహితులు ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆపదలో, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రాజేష్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని మానసిక వికలాంగులకు అన్నప్రసాదం వడ్డించి, వారి ఆశీస్సులు పొందారు.రాజేష్‌తో తమకు ఉన్న చిన్ననాటి స్నేహాన్ని గుర్తుచేసుకున్న స్నేహితులు ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ తమతోనే ఉంటాయని తెలిపారు. దశాదిన కర్మను కేవలం సంప్రదాయ కార్యక్రమంగా కాకుండా సేవా కార్యక్రమంగా నిర్వహించడం ద్వారా సమాజానికి మానవతా సందేశాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో మాచర్ల వినయ్, సుంకరి శ్యామ్, బాబాజీ నాగరాజు, కట్ల రాజు, మిరియాల కార్ శేఖర్, రాచపల్లి ప్రవీణ్, సుంకరి భాస్కర్, యుగేందర్, మారపల్లి సురేష్, శ్రీకాంత్, ఎండీ అన్వర్, రాజు, శ్రీను, రామ్ ప్రసాద్, గోవింద్, దుంప మహేష్ మిరియాలు కార్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ అక్రమ వ్యాపారం పై ఇద్దరిపై కేసు నమోదు

## - శ్రీలక్ష్మి రైస్ మిల్ యజమాని కుమారుడు వొల్లాల నవీన్ కుమార్, పవనసుత రైస్ మిల్ యజమాని రావికంటి - పవన్ కుమార్ పై కేసు



**మంథని, ఆగస్టు 28 (ప్రజాజ్యోతి):**

సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ప్రణాళికకు సంబంధించిన నమోదు వివరాలు చూపించకుండా చట్టవిరుద్ధంగా వ్యాపారం చేసిన ఆరోపణలపై మంథని సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో విచారణ చేపడుతూ అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. సూరయ్యపల్లి రైస్ మిల్ యజమాని వొల్లాల సత్యనారాయణ కుమారుడు వొల్లాల వొల్లాల నవీన్ కుమార్, పవనసుత రైస్ మిల్ యజమాని రావికంటి పవన్ కుమార్ లను శుక్రవారం అరెస్టు చేసామన్నారు.సురయ్యపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మి రైస్ మిల్ ల్లో సీఎంఆర్‌కు సంబంధించిన ప్రణాళిక, నమోదు వివరాలు, మిల్లులో జరుగుతున్న కార్యకలాపాలపై అధికారుల దృష్టికి వచ్చిన ఫిర్యాదుల మేరకు సిఐ స్వామి విచారణ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం, బియ్యం వ్యాపారం నిర్వహించినట్లు ఆరోపణల పై అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి నవీన్‌ను అదుపులోకి తీసుకుని మిల్లుకు సంబంధించిన పత్రాలు, సీఎంఆర్ లావాదేవీలు, నిల్వల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామన్నారు.

# నిబంధనల మేరకే కొలతలు,

**ఎండపల్లి, ఆగస్ట్ 28,ప్రజా జ్యోతి,**

జగిత్యాల కూడలి వద్ద చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణం ఆర్అండ్‌బీ నిబంధనల మేరకే జరుగుతోందని రాజారాంపల్లి సర్పంచ్ సంగ రమేష్‌యాదవ్ తెలిపారు. ఆర్అండ్‌బీ నిర్దేశించిన 33 అడుగులకు అదనంగా ఆదర్శనగర్ ప్రజలు మరో రెండు అడుగుల స్థలాన్ని ఇచ్చారని చెప్పారు. దీంతో 35 అడుగుల పరిధిలో పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. . రూ.80 వేల పరిహారానికి సంబంధించిన వ్యవహారం 15 ఏళ్ల క్రితం జరిగిందని, అప్పట్లో ప్రహరీ గోడ, సెప్టిక్ ట్యాంకు తదితర నిర్మాణాలను తొలగించారని వివరించారు. పాత అంశాన్ని ప్రస్తుత పనులతో ముడిపెట్టడం సరికాదన్నారు. అధికారిక సర్వే, ప్రభుత్వ రికార్డులు, ఆర్అండ్‌బీ నిర్ణయాల మేరకే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. చౌరస్తాలో ప్రమాదాలకు కారణాలను పోలీసులు, ఆర్అండ్‌బీ అధికారులు సాంకేతికంగా నిర్ధారించాలన్నారు. చిన్న వ్యాపారులను ప్రమాదాలకు కారణాలుగా చూపడం సమంజసం కాదన్నారు. రాజకీయ దురుద్దేశంతో అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని కోరారు.



# కరీంనగర్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

## - 9 మంది యువకుల అరెస్ట్

## - రూ.6.50 లక్షల మత్తు పదార్థాలు స్వాధీనం




**కరీంనగర్ క్రైం, ఆగస్టు 28,(ప్రజాజ్యోతి):**

కరీంనగర్ రూరల్ పోలీసులు భారీగా హాష్ ఆయిల్,గంజాయి,డ్రగ్ ట్యాబ్లెట్లు స్వాధీనం చేసుకుని తొమ్మిది మంది యువకులను శుక్రవారం అరెస్ట్ చేశారు.కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం బొమ్మకల్‌లోని నేచర్ క్యూర్ హాస్పిటల్ సమీపంలో అనుమానాస్పదంగా గుమిగూడిన యువకులను రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై లక్ష్మారెడ్డి,పోలీసు సిబ్బంది కలిసి 9 మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా మత్తు పదార్థాల అక్రమ రవాణా,విక్రయాల విషయం వెలుగులోకి వచ్చింది.అరెస్టైన వారిని మొర్రి ఆకాశ్,పుట్టపాక విష్ణు సాయి,భైనవేని నితీష్,కోసిని బాలచంద్ర్, గుండు మనోహర్,విస్కుమల్లి విశాల్,గుండు కృష్ణగిరి,సిరిసిల్ల ప్రభాస్,మాకుల శివప్రసాద్‌గా గుర్తించారు.వీరి వయస్సు 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండగా కొందరు బీటెక్, డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి విద్యను అభ్యసించినట్లు సిఐ తెలిపారు.వారి వద్ద నుంచి సుమారు 500 గ్రాములు,మిల్లీలీటర్ల హాష్ ఆయిల్, 500 గ్రాముల గంజాయి,60 డ్రగ్ ట్యాబ్లెట్లు,14 సిరంజీలు,హాష్ ఆయిల్ వినియోగ పరికరాలు,8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.వీటి ప్రభుత్వ అంచనా విలువ సుమారు రూ.6.50 లక్షలు ఉంటుందని సిఐ తెలిపారు.నిందితులు అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలను తీసుకొచ్చి కరీంనగర్‌లో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.డ్రగ్ ట్యాబ్లెట్లను ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించినట్లు ఆరోపణలతో ఓ మెడికల్ షాప్ నిర్వాహకుడిపై కూడా కేసు నమోదు చేశారు.నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,అక్రమ విక్రయాల సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# పండగొస్తే చాలు..

## ప్రయాణికులపై అదనపు చార్జీల భారం!

### - ప్రత్యేక బస్సుల పేరుతో వసూళ్లు..

### ఆర్టీసీ తీరుపై ప్రయాణికుల ఆవేదన

**మేడిపల్లి,భీమారం,ఆగస్టు 28 ప్రజాజ్యోతి**

పండగ వచ్చిందంటే చాలు.. సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులపై అదనపు చార్జీల భారం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నప్పటికీ, ప్రత్యేక సర్వీసుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.సాధారణ రోజుల్లో ఉన్న చార్జీలతో పోలిస్తే పండగ సమయాల్లో ప్రత్యేక బస్సుల్లో అధిక మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. కుటుంబ సమేతంగా సొంత గ్రామాలకు వెళ్లే వారు తప్పనిసరి పరిస్థితుల్లో అదనపు చార్జీలు భరించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.పండగల సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సులు ఏర్పాటు చేయడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ, అందుకు ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పండగ అంటే ఆనందంగా సొంతూళ్లకు వెళ్లాల్సిన ప్రయాణికులకు అదనపు చార్జీలు భారంగా మారుతున్నాయని వాపోతున్నారు.ఆర్టీసీ అధికారులు స్పందించి పండగ సీజన్‌లో ప్రత్యేక బస్సుల చార్జీలపై స్పష్టత ఇవ్వడంతో పాటు, ప్రయాణికులపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ధర్మారం ఎస్ఐగా ఎంబడి శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

**ధర్మారం, ఆగస్టు 28 (ప్రజా జ్యోతి):**




ధర్మారం మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా ఎంబడి శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ధర్మారం పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన ఆయనకు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలు,నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, చట్టపరంగా పరిష్కరించాల్సిన ప్రతి అంశంపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. మండలంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసులకుసహకరించాలని కోరారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక.. రక్షాబంధన్

# ప్రేమానురాగాలు, ఆత్మీయతను చాటే రాఖీ పండుగ

**కోరుట్ల, ఆగస్టు 28 ప్రజాజ్యోతి**



అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనురాగం, పరస్పర నమ్మకానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పండుగను శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా సోదరీమణులు తమ సోదరుల చేతులకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు.రాఖీ కట్టే ముందు సోదరుడికి తిలకం పెట్టి, హారతి ఇచ్చి, రాఖీ కట్టి మిఠాయిలు తినిపించడం సంప్రదాయంగా వస్తోంది. సోదరులు తమ సోదరీమణులకు బహుమతులు అందిస్తూ జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తారు. దీంతో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది.



**- రాఖీ.. ఓ దారానికి మించిన అనుబంధం**

రాఖీ అనేది కేవలం చేతికి కట్టే రంగురంగుల దారం మాత్రమే కాదు.. ప్రేమ, నమ్మకం, బాధ్యత, రక్షణకు ప్రతీక. కాలానుగుణంగా రాఖీ పండుగ భావన కూడా విస్తరిస్తోంది. రక్తసంబంధంతో పాటు ఆత్మీయత ఉన్నవారు కూడా ఒకరినొకరు సోదరుడు, సోదరిగా భావిస్తూ రక్షాబంధన్ జరుపుకుంటున్నారు.



**- దూరంగా ఉన్నా.. బంధం మాత్రం దగ్గరే**

ఉద్యోగాలు, విద్య, వ్యాపారాల కారణంగా అన్నాచెల్లెళ్లు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ రాఖీ పండుగ సందర్భంగా ఒక్కటవుతున్నారు. కొందరు ప్రయాణాలు చేసి సోదరుల వద్దకు చేరుకోగా, మరికొందరు ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా తమ ప్రేమను పంచుకున్నారు. దీంతో పండుగ కుటుంబ బంధాల విలువను మరోసారి గుర్తుచేసింది.



**- కుటుంబ బంధాలకు మరింత బలం**

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో కుటుంబ సభ్యుల మధ్య సమయం తగ్గుతున్న నేపథ్యంలో రక్షాబంధన్ వంటి పండుగలు బంధాలను మరింత బలోపేతం చేస్తాయని పలువురు పేర్కొన్నారు. సోదరుడు తన సోదరికి అండగా నిలవడం, సోదరి తన సోదరుడి క్షేమాన్ని కోరుకోవడం ద్వారా పరస్పర ప్రేమ, బాధ్యతలను ఈ పండుగ గుర్తుచేస్తుంది.రాఖీ పండుగ సందేశం ఒక్కటే..బంధం రక్తంతో ఏర్పడినా.. దాన్ని నిలబెట్టేది ప్రేమ, నమ్మకం, ఆప్యాయత.రక్షాబంధన్ సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధం మరింత బలపడాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని పలువురు ఆకాంక్షించారు.

